

వేలేరుపాడులో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాసానికి తరలించాలి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు

వేలేరుపాడు, జూలై 21: గోదావరికి వరద పోటెత్తుతుందని, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం వేలేరుపాడు మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం పెరుగుతున్న స్థాయిని అనుసరించి ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని మిగిలిన ప్రాంతాల్లో కూడా సహాయక కార్యక్రమాలు ప్రారంభించాలని ఆదేశించారు. వరద ఉధృతి తగ్గే వరకు పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలకు తాత్కాలిక వసతి కల్పించాలని, వారికి మూడు రోజులకు సరిపోయే విధంగా బియ్యం, కందిపప్పు, వంటనూనె ప్యాకెట్లు 5 రకాల కూరగాయలు ప్రతీ కుటుంబానికి అందించాలన్నారు. అల్లూరినగర్‌లో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు 15 టార్పలిన్లు అందించడం జరిగిందని, మిగిలిన ఇళ్ల వారికి కూడా టార్పలిన్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు కలెక్టర్ వరద పరిస్థితి సమాచారం తెలుసుకుంటూ అధికారులకు తగు సూచనలు ఇస్తూనే ఉన్నారు.



వేలేరుపాడులో వరదను పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రాణనష్టం జరగకుండా చర్యలు

ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

వేలేరుపాడు మండలంలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల్లో ప్రాణనష్టం జరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కే.ప్రతాప్ శివకిశోర్ పోలీస్ అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాలను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, పోలీస్, రెవెన్యూ శాఖల వారు లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే తాను పర్యవేక్షిస్తూనే ఉంటానని తెలిపారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని, నీటి ప్రవాహం తగ్గేంత వరకు ప్రవాహానికి ఎదురుగా వెళ్లరాదని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను రక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బందిని పలు ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచామని తెలిపారు.

గట్ల వద్ద నిఘా పెంచండి

ఏలూరు క్రైం, జూలై 21: తమ్మిలేరు గట్ల వద్ద నిఘా పెంచాలని కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ అధికారులను ఆదేశించారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తమ్మిలేరు పరీవాహక ప్రాంతమైన సాయినగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఎంఆర్ నగర్, కొమడవోలులో కలెక్టర్, ఎస్పీ ఆదివారం పర్యటించారు. తమ్మిలేరు గట్ల పరిస్థితిని స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. సంబంధిత పోలీస్ సిబ్బంది, అధికారులు రాత్రి వేళ కూడా గస్తీ ఉండాలని ఆదేశించారు. ఆర్డీవో ఖాజావలి, డీఎస్పీ ఈ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాష్, డీఈ వై.అర్జునరావు, కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, తహసీల్దార్ మురార్జి, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి పాల్గొన్నారు.

నేడు మీకోసం కార్యక్రమం రద్దు

ఏలూరు రూరల్, జూలై 21: జిల్లాలో వర్షాలు, వరదలు కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ మీకోసం కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మండల, డివిజన్‌స్థాయిలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కూడా రద్దుచేసినట్లు ఆమె తెలిపారు.

నేడూ విద్యా సంస్థలకు సెలవు

ఏలూరు అర్బన్, జూలై 21: వర్షాల ప్రభావంతో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం కూడా సెలవు ప్రకటించారు. డీఈవో అబ్రహం, ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి చంద్రశేఖరబాబు, డిగ్రీ కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ మల్లేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో ఆదివారం రాత్రి తెలిపారు. ఈ సెలవులకు ప్రత్యామ్నాయంగా (కాంపెన్సేటరీ) సాధారణ సెలవు దినాల్లో విద్యా సంస్థలు పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

వరద గోదావరి

ఎగువన కురిసిన వర్షాలు, ఉప్పొంగుతున్న ఉప నదులతో గోదావరికి వరద పోటెత్తుతోంది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో జిల్లా అతలాకుతలమైంది. వాగులు, జలాశయాలు, కాల్వలు పొంగి పంట చేలను ముంచెత్తాయి. వర్షాలు తగ్గుముఖం పట్టిన సమయంలో గోదావరి వరద జిల్లా ప్రజలను భయపెడుతోంది. భద్రాచలం వద్ద ఆదివారం రాత్రికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద పోటుతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వర్షాలకు పెద్ద వాగు పొంగి పది గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగానే రెండు మండలాల్లో అధికారులను కలెక్టర్, ఎస్పీ అప్రమత్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే 48 గేట్ల నుంచి 9.82 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. భోజనం, తాగునీరు, విద్యుత్, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు. వర్షాలు, పెద్దవాగు ఉధృతికి పంటలు దెబ్బతినగా గోదావరి వరదతో పూర్తిగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యలపై దృష్టి సారించారు.




పోలవరం వద్ద గోదావరి వరద ఉధృతి

ఎగువన వర్షాలు.. ఉప నదుల జలాలతో పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ఎగువన భారీ వర్షాలతో పెరుగుతున్న గోదావరి
- ఉప్పొంగుతున్న గోదావరి ఉప నదులు
- పోలవరం స్పిల్‌వే నుంది దిగువకు నీరు విడుదల
- కుక్కునూరు, వేలేరుపాడులో ముందస్తు చర్యలు
- లోతట్టు ప్రాంత ప్రజలను తరలించిన అధికారులు
- పునరావాస కేంద్రాల్లో భోజనం, తాగునీటి సౌకర్యం
- వరద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, ఆచంట, యలమంచిలి, జూలై 21: భారీ వర్షాలకు తడచి, మునిగిన జిల్లాను గోదావరి వరద భయపెడుతోంది. వేలేరుపాడులో పెదవాగు ప్రాజెక్టు గండితో అతలాకుతలమైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి వరద మరింత ఆందోళన కలిగిస్తోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవడంతో ఆదివారం రాత్రి మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. 48 అడుగుల నీటిమట్టం నమోదైతే రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావచ్చని, తీర ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం నుంచి దిగువ పోలవరానికి 8,85,224 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నట్లు అధికారుల అంచనా. తెలంగాణలోని సమ్మక్క బ్యారేజ్ నుంచి 8.50 లక్షల క్యూసెక్కుల నీటిని తాలిపేరు ప్రాజెక్టు నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీనికి తోడు శబరి వరద ప్రవాహం పెరుగుతోంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద నీరు పెరిగింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల ముంపుపై దృష్టి పెట్టారు. కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెంలో 132 కుటుంబాలను దాచారం పునరావాస కాలనీకి తరలిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్ళవరం, జిగురుమామిడి గ్రామాల్లో ఉన్న దాదాపు 3వేల కుటుంబాలను పునరావాస కాలనీలకు తరలిస్తున్నారు. దాచారం పునరావాస కానీలో గొమ్ముగూడెం ప్రజలక దాచారం పునరావాస కాలనీలో భోజన సదుపాయం, విద్యుత్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అచ్యుతకుమారి తెలిపారు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున కౌండిన్యముక్తి, లచ్చిగూడెం గ్రామస్థులను కూడా తరలిస్తామని తహసీల్దార్ తెలిపారు. వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నార్లవరం, చిగురుమామిడి గ్రామాల ప్రజలను ఆదివారం ఉదయం నుంచి ఇళ్లలో సామగ్రితో సహా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నీటిమట్టం 48 అడుగులకు చేరితే దాదాపు మండలంలోని అన్ని గ్రామాలకు రహదారులు బంద్ అవుతాయి. ముందుగానే ఆయా గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలిపోతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు దగ్గరుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా భారీ వర్షాలతో అతలాకుతలమవుతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు గోదావరి వరద పెరుగుతుండడంతో కంటిమీద కునుకులేదు. ఇప్పటికే గోదావరి తీర ప్రాంతంలో వరి నారుమడులు పత్తి పంటల సాగు చేపట్టారు. వరదతో నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి ఉధృతి మరింత పెరగడంతో ఆచంట మండలం కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురం పుష్కరఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. లంక వాసుల్లో ఆందోళన మొదలైంది. లంక భూముల్లో పశువులను సురక్షిత ప్రాంతానికి చేర్చడానికి రైతులు పరుగులు పెట్టారు. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గోదావరిలో నాటు పడవలు రాకపోకలు నామమాత్రంగా తిరుగుతున్నాయి. కోడేరు వద్ద వరద పరిస్థితిని రెవెన్యూ, పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. యలమంచిలి మండలంలోని కనకాయలంక కాజ్‌వేపై వరదనీరు చేరుతోంది. ఆదివారం సాయంత్రానికి కాజ్ వేపై సుమారు ఒకఅడుగు వరదనీరు ప్రవహిస్తోంది. కనకాయలంక గ్రామవాసులు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే కనకాయలంక - డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా చాకలిపాలెం గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వే పై రాకపోకలు సాగిస్తారు. కాజ్ వే పూర్తిగా నీటమునిగితే గ్రామస్తులు పడవలపైనే రాకపోకలు సాగించాలి. వరద నీటి ఉధృతి క్రమేపీ పెరుగడంతో సోమవారం సాయంత్రానికి కాజ్‌వే పూర్తిగా నీట మునుగిపోయే అవకాశం ఉంది.



స్పిల్‌వే వద్ద గోదావరి ఉధృతి

• పోటెత్తిన పోలవరం

పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. ఉప నదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరు జలాలు గోదావరిలో చేరుతున్నాయి. వరద జలాలను స్పిల్‌వే నుంచి 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. 9,82,586 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఈఈ మల్లికార్జునరావు, డీఈ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.590 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.320 మీటర్లు నీటి మట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరింది. ధవళేశ్వరం వద్ద 175 నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 9 లక్షల క్యూసెక్కుల వరద జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్‌వేలోకి సోమవారం నాటికి మరో 10 లక్షల క్యూసెక్కుల వరద జలాలు గోదావరిలో చేరనున్నట్లు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా పది లక్షల క్యూసెక్కుల పరిధి దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామని ధవళేశ్వరం బ్యారేజి డీఈఈ రమేశ్ తెలిపారు.



ఆచంట మండలం కోడేరులో వరద నీటితో మునిగిన పుష్కరఘాట్



యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపై వరద నీరు

నిండిన జలాశయాలు

- తమ్మిలేరు జలాశయంలో 1.620 టీఎంసీల నీటి నిల్వ
- ఎర్రకాల్వ జలాశయం నుంచి నీరు విడుదల

ఏలూరు సిటీ, పోలవరం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, చాట్రాయి, జూలై 21: బంగాళాఖాతంలో వాయుగుండం తీరందాటి బలహీన పడినా జిల్లాలో ఆదివారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా తమ్మిలేరు వరద ఉధృతి కొనసాగుతోంది. తమ్మిలేరు ప్రాజెక్టుకు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇన్‌ఫ్లో 3800 క్యూసెక్కులు ఉండగా, సాయంత్రం 6 గంటలకు 2360 కూసెక్కులకు తగ్గిందని, ప్రాజెక్టు నీటిమట్టం 346.73 అడుగులకు చేరిందని ఏఈ పరమానందం తెలిపారు. జలాశయంలో మూడు టీఎంసీల నీరు నిల్వ ఉంచవచ్చని, ప్రస్తుతం 1.620 నీరు నిల్వ ఉందని చెప్పారు. జలాశయం నిండుకుండలా ఉండడంతో రైతులు, ప్రజలు ప్రాజెక్టు వద్దకు వచ్చి తిలకిస్తున్నారు.

పోలవరం మండలంలో కొండ వాగులు, రిజర్వాయర్లు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. గుంజవరం, పేడ్రాల కాలువలు, కొండవాగుల జలాలు పొంగి గుంజవరం కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్నాయి. ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయర్‌లోకి కొండవాగుల జలాలు చేరడంతో 88.10 టీఎంసీల నీటిమట్టం నమోదైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 330 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసినట్లు ఏఈ కొండలరావు తెలిపారు. గోదావరి నీటిమట్టం కడమ్మ స్లూయిజ్ గేట్లకు సమాంతరంగా ఉండడంతో కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే వీలులేక పంట చేలు నీట మునిగాయి. జంగారెడ్డిగూడెం మండలంలోని కరాటం కృష్ణమూర్తి ఎర్ర కాలువ జలాశయంలో వరద నీరు తగ్గుముఖం పట్టింది. గంటకు 7048 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి చేరగా జలాశయం నాలుగు గేట్ల ద్వారా గంటకు 7250 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.40 మీటర్ల వరకూ నీటి మట్టం చేరిందన్నారు. బుట్టాయగూడెం మండలం గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం నుంచి నీటి విడుదల ఆదివారం కూడా కొనసాగింది. జలాశయంలో నీటి సామార్థ్యం 215.60 మీటర్లు ఉందని ఏఈ తులసి తెలిపారు. ఇన్‌ఫ్లో 260 క్యూసెక్కులు ఉండగా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌ఫ్లో తగ్గేవరకు నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.

జిల్లాలో 10.1 మి.మీ. వర్షపాతం

జిల్లాలో గడచిన 24 గంటల్లో అత్యధికంగా నూజివీడు మండలంలో 29.2 మి.మీ., జిల్లాలో సరాసరి 10.1 మి.మీ. వర్షపాతం నమోదైంది. వేలేరుపాడులో 19, చాట్రాయి 14.8, బుట్టాయిగూడెం 14.4, భీమడోలు 14, కుక్కునూరు 13.4, జీలుగుమిల్లి 13.4, ఆగిరిపల్లి 12.6, పెదవేగి 11.8, చింతలపూడి 11.6, టి.నరసాపురం 11.2, జంగారెడ్డిగూడెం 10.6, ఉంగుటూరు 10.4, లింగపాలెం, కామవరపుకోట, కొయ్యలగూడెంలలో 9.8, నిడమర్రు 9.4, పోలవరం 8, పెదపాడు 7.8, దెందులూరు 7.6, ఏలూరు రూరల్ 7.4, ఏలూరు అర్బన్ 6.4, ముసునూరు 4.6, కలిదిండి 4.4, కైకలూరు 3.8, ముదినేపల్లి 3.6, మండవల్లి 2.6, ద్వారకాతిరుమలలో 2.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.



తమ్మిలేరు జలాశయం

4870 హెక్టార్లలో మునిగిన పంట



ఏలూరు రూరల్ మండలంలో నీట మునిగిన వరి నాట్లు

ఏలూరు సిటీ, రూరల్, వేలేరుపాడు, బుట్టాయగూడెం, జూలై 21: భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో 4870 హెక్టార్లలో వివిధ పంటలు నీట మునిగాయి. 200 హెక్టార్లలో వరి నారుమడు, 4522 హెక్టార్లలో నాట్లు ముంపులోనే ఉన్నాయి. 148 హెకార్లలో పత్తి పంట నీట మునిగింది. కొద్ది రోజులు వరి నాట్లు నీటి ముంపులో ఉంటే తిరిగి నాట్లు వేయాల్సిందేనని, నారు కుళ్ళిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో భారీ వర్షాలు, ఎర్రకాలువ వరద కారణంగా వరి, పత్తి పంటలు నీటమునగడం, కూరగాయల పంటలు, అరటి పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతం. జిల్లాలో సార్వా వరి సాగు చేసిన ప్రాంతాల్లో ఎక్కువగా చింతలపూడి, బుట్టాయిగూడెం, దెందులూరు, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, నిడమర్రు, పోలవరం, కామవరపుకోట మండలాల్లో నారు నీట మునిగాయని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఉంగుటూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నిడమర్రు, చింతలపూడి, ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, కామవరపుకోట, దెందులూరు, భీమడోలు, మండలాల్లో వరి నాట్లు అత్యధికంగా నీటి ముంపునకు గురయ్యాయి. 161 గ్రామాలులో పంటలు నీట మునగగా 3696 మంది రైతులు పంటను నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి, చొదిమెళ్ళ, పాలగూడెం ప్రాంతాల్లో వరి పొలాల్లో అడుగు లోతు నీరు నిలిచిపోయింది. డ్రెయిన్లు ఎగదన్నడంతో ఉంపు నీరు బయటకు పోవడం లేదు. మూడు, నాలుగు రోజుల పాటు నీరు ఇలానే నిలబడి ఉంటే పైరు మొత్తం కుళ్ళిపోతుంది. తంగెళ్ళమూడి నుంచి ఆర్టీసీ కాలనీవైపు వస్తున్న మురుగుడ్రైన్‌లో గుర్రపుడెక్క పెద్దఎత్తున పేరుకుపోయింది. గుర్రపుడెక్క, కర్రనాచు కారణంగా డ్రెయిన్లలో నీరు ఎగదన్నడంతో పొలాల్లో నీరు నిలిచి నాట్లువేసిన వరిపైరు తేలియాడుతుంది.

వేలేరుపాడు మండంలో పెదవాగు విధ్వంసంతో రైతులు పంట కోల్పోయారు. వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేయడంతో భూములు ఎందుకు పనికి రాకుండాపోయాయి. పెదవాగు ప్రాజెక్టు కుడికాల్వ కింద మండలంలో సుమారు 4వేల ఎకరాల వరకు వరి, మొక్కజొన్న ఇతర పంటలు సాగు చేస్తున్నారు. వీటికి పెదవాగు కాల్వల నుంచి విడుదలయ్యే నీరే ఆధారం. పెదవాడు ప్రాజెక్టుకు గండిపడి ప్రాజెక్టు మొత్తం ఖాళీ కావడంతో ప్రాజెక్టు కింద పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది. వరదతో సర్వస్వం కోల్పోగా అప్పు చేసి వ్యవసాయం చేద్దామన్నా ఇసుక మేటలతో సాధ్యం కాని పరిస్థితి. మేడేపల్లి, ఒంటిబండ, కమ్మరగూడెం, ఊటగుంపు, విప్పలగుంపు, రాళ్ళపూడి, వసంతవాడ, గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. ఇసుక తొలగించాలంటే రైతులకు తలకుమించిన భారమే. ప్రభుత్వమే చొరవ తీసుకుని పొలాల్లోని ఇసుక మేటలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో భారీవర్షాలకు అటవీ ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా కొట్టుకుపోయాయి. అనేక చోట్ల నామరూపాలు లేకుండా ధ్వంసమయ్యాయి. రహదారులు ధ్వంసం కావడంతో అటవీ ప్రాంతాల్లో మోదేలు, లంకపాకల, డోలుగండి, గొట్టాలరేవు, రేపల్లె, రేగులపాడు, పూచికగొంది తదితర కొండరెడ్డి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలివేరు - డోలుగండి ప్రధాన రహదారి భారీ వర్షాలకు అనేక చోట్ల ధ్వంసమైంది. కాలి నడకన వెళ్ళడానికి కూడా వీలు లేకుండా రహదారులు దెబ్బతిన్నాయి. ఇటీవల ఏజెన్సీ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లను నిర్మిస్తు అండర్ గ్రౌండ్ కేబుల్స్ బయటకు వచ్చేశాయి.



వేలేరుపాడు పంట భూముల్లో మేట వేసిన ఇసుక



బుట్టాయగూడెం మండలంలో కొట్టుకుపోయిన రహదారి

ఘరానా మోసగాళ్లు



ప్రతి ఒక్కరూ తమ కుటుంబ అవసరాల కోసం రూపాయి..రూపాయి కూడబెట్టుకుంటారు. ఆ విధంగా పొదుపు చేసిన నగదును ఎవరో వచ్చి తన్నుకుపోయినట్టు ఘరానా మోసగాళ్ల వలలో పడి ప్రజలు మోసపోతున్నారు. అమాయక ప్రజల మంచితనాన్ని ఆసరాగా చేసుకుని నిలువుదోపిడీ చేస్తున్నారు. చౌకగా బంగారం వస్తుందని ఆశపడి ఉన్నది కూడా పోగొట్టుకుంటున్న సందర్భాలు అనేకం. కొంతమంది అమాయకత్వం.. అతి మంచితనం.. అత్యాశలను ఆసరాగా చేసుకుని మధ్యతరగతి, ఉన్నత వర్గాలను నిలువునా దోచుకుంటున్నారు. చదువుకున్న వారు కూడా ఆ సమయంలో అప్రమత్తంగా లేకపోవడంతో నగదు పోగొట్టుకున్న తరువాత మోసపోయామని గ్రహించి ఏమిచేయలేక మిన్నకుండిపోతున్నారు. మోసగాళ్ల మాయమాటలకు లోబడి సర్వస్వం పోగొట్టుకుని కుటుంబానికి అప్పులు మిగిలుస్తున్నారు. ఇటీవల భీమవరం, గణపవరం, ఏలూరు, నిడమర్రు పరిసర ప్రాంతాల్లో జరిగిన కొన్ని సంఘటనలే దీనికి నిదర్శనం. ఈ ఘరానా మోసగాళ్ల తీరును గమనించి అందరూ అప్రమత్తంగా ఉండాలంటూ ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- నిడమర్రు

■ **నకిలీ బంగారంతో మోసం**

పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు మండలంలోని కొల్లేరు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు గణపవరంలో (ఊరిపేరు మార్పు) ఓ షాపు అద్దెకు తీసుకొని రెడీమేడ్ షాపు నిర్వహిస్తున్నారు. ఇటీవల 40 ఏళ్ల వయసుగల వ్యక్తితో పాటు మరో మహిళలు షాపునకు వచ్చి వరుసగా మూడు రోజులపాటు వస్తూ ప్రతిరోజు వెయ్యి నుంచి మూడు వేల రూపాయల వరకు దుస్తులు కొనుగోలు చేస్తూ పరిచయం పెంచుకున్నారు. వారం రోజుల తరువాత "అయ్యా మాకు ఒక చోట బంగారం బిస్కెట్ దొరికింది, ఇది నిజం బంగారమా కాదా మాకు చెక్ చేసి చెప్పండి మీకు పుణ్యముంటుంది' అని వేడుకోగా షాపు యజమాని ఆ మాటలు నమ్మి కొంతమంది స్వర్ణకారుల వద్దకు తీసుకెళ్లగా వారు పరిశీలించి ఇది నిజమైన బంగారమే అని నిరూపించి చూపించారు. ఇదే విషయాన్ని వారికి చెప్పగా.. ఈ బంగారం అమ్మాలంటే మావల్ల కాదు, ఏదో ఒక రేటుకి సగం రేటుకైనా మీరే అమ్మిపెట్టండంటూ వేడుకనాన్నారు. సగం ధరకే బంగారం వస్తుందనే ఆశతో ఇంట్లో భార్య మంగళసూత్రాలు తాకట్టుపెట్టి, తెలిసిన వారి వద్ద అప్పుచేసి నాలుగు లక్షలు రూపాయలు చెల్లించి ఆ బంగారం బిస్కెట్టు తీసుకున్నాడు. వారం రోజుల తర్వాత ఆ బంగారాన్ని వస్తువు చేయిద్దామని స్వర్ణకారుని వద్దకు తీసుకెళ్లగా ఇది బంగారమే కాదని చెప్ప డంతో అవాక్కయ్యాడు. షాపు యజమానికి చూపించిన బంగారం బిస్కెట్‌ను పోలిన నకిలీ బంగారంతో మోసగించారు.

■ **పెళ్లి వేడుకలలో వడ్డాణం దొరికిందని..**

భీమవరం (ఊరిపేరు మార్పు) సమీపాన గల ఓపల్లెలో చికెన్ షాపు యజమాని వద్దకు ఒక పెద్ద మనిషి వచ్చి ప్రతి రోజూ కోడి మాంసం కొట్టించుకుని వెళుతూ పరిచయం పెంచుకున్నాడు. షాపు యజమాని ఏం చేస్తున్నావని అడిగితే మాది గుంటూరు జిల్లా అని బిల్డింగ్ పనులకు మనుషులను సరఫరా చేస్తామని చెప్పుకొచ్చాడు. ఓ వారం తర్వాత ఒక సంచిలో బంగారం వడ్డాణం తీసుకువచ్చి మాకు పెళ్లిమండపం వద్ద దొరికిందని దీనికి రేటు కట్టించమని, ఇది ఒరిజినల్ బంగారమోద కాదో తేల్చాలని విన్నవించాడు. వడ్డాణంలో చిన్న ముక్క కట్ చేయించి తీసుకెళ్లగా ఒరిజినల్ బంగారమని తేలింది. ఇదే విషయాన్ని ఆ మేస్త్రికి తెలిపాడు. నేను ఈ ఊరిలో అమ్మలేను ఏదో ఒక రేటు మీరే అమ్మిపెట్టండని చెప్పడంతో చికెన్ షాపు యజమానికి ఆశ పుట్టి.. 16 లక్షల రూపాయలు విలువ గల వడ్డాణాన్ని సగం ధరకు అంటూ 8 లక్షలు చెల్లించాడు. వారం రోజుల తరువాత ఓ పెళ్లివేడుకకు వడ్డాణం పెట్టుకొందామని బీరువాలో నుంచి తీస్తే దానిపై తెల్లటి మచ్చలు ఉండడంతో అనుమానం వచ్చి చెక్ చేస్తే ఒరిజినల్ బంగారం కాదని మోసపోయినట్టు తెలిసింది.

■ **ప్లాటినమ్ బిస్కెట్ అంటూ మోసం**

ఏలూరులో (పేరుమార్పు) ఎన్నికలకు ముందు ఏలూరులో ఓ ఆక్వా వ్యాపారి వద్దకు ఓ తెలుగు వ్యక్తి వచ్చి ముంబై నుంచి వచ్చామని ప్లాటినమ్ బిస్కెట్లు అమ్మకానికి తెచ్చామని ఎన్నికల వల్ల డబ్బులు లేక ఎవరూ, బంగారంషాపు వాళ్లు కొనడం లేదని వెనక్కి తీసుకెళ్దామంటే పోలీస్ చెకింగ్‌లు ఎక్కువగా ఉన్నాయని, సగం రేటు అమ్మేస్తానని చెప్పుకొచ్చాడు. బిస్కెట్ ధర రూ.10 కోట్లు అని చెప్పి తన వద్ద నాలుగు బిస్కెట్లు ఉన్నాయని, బయట మార్కెట్‌లో చెక్ చేసుకొని సొమ్ము ఇవ్వాలని తెలిపారు. ఆ వ్యాపారస్థుడు మరో ముగ్గురు మిత్రులతో కలిసి చెక్ చేయించగా ఒరిజినల్ ప్లాటినమ్ అని తేలడంతో సగం ధర రూ. 5 కోట్లు చెల్లిస్తామని.. మూడు కోట్లు అడ్వాన్స్‌గా చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన సొమ్ము వారంలోగా సర్దుబాటు చేస్తామని ఒప్పందం కుదురుకుని మూడు కోట్లు చెల్లించారు. ఈ వారం రోజులలో ఆక్వా వ్యాపారి రాజమండ్రి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో చెక్ చేయించగా అందరూ ప్లాటినమ్ ఒరిజినల్‌గా నిర్ధారించారు. వారం తరువాత మిగిలిన రూ. 2 కోట్లు చెల్లించారు. ఆ సమయంలో సదరు వ్యక్తి మీకిచ్చిన ప్లాటినమ్ బిస్కెట్ సీరియల్ నంబరు నోట్ చేసుకోవడం మరిచిపోయానని ఒక్కసారి తెమ్మని చెప్పి కాపేపు పరిశీలించి తిరిగి ఇచ్చేసి మిగిలిన సొమ్ము వసూలు చేసుకుని వెళ్లాడు. తరువాత ప్లాటినమ్ కట్ చేసి పంచుకొందామని భావించిన ఆ ముగ్గురు వ్యాపారులకు అది రజనుగా రాలిపోవడంతో అనుమానం వచ్చి పరిశీలించగా డ్యూప్లికేట్ అని తేలింది. ఆ వ్యాపారి ఇంట్లో గల సీసీ కెమేరాల్లో కూడా ఆ బంగారం వ్యాపారి చిత్రాలు నమోదు కాబడలేదు.

నకిలీ బంగారంతో మోసగిస్తున్న దొంగలు

అమాయక ప్రజలే లక్ష్యంగా..



అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొన్ని ముఠాలు బంగారం అని చెప్పి నకిలీ బంగారాన్ని అమ్ముతున్నారు. బంగారం సగం ధరకు ఇస్తామంటే ఎవరూ నమ్మవద్దు. నమ్మి మోసం పోవడం కన్నా ముందుగా తెలివితో జాగ్రత్త వహించడం మంచిది. నకిలీ బంగారం అమ్మకం విషయంలో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేయాలని కోరుతున్నాం.

- నేచర్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కొన్ని ముఠాలు ఉన్నత కుటుంబాలను, అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ బంగారం సగం ధరకు ఇస్తామని చెప్పి సొమ్ములు కాజేస్తుంటాయి. ఎవ్వరూ ఒరిజినల్ బంగారం సగం ధరకు ఇవ్వరని గుర్తుంచుకోండి. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నకిలీ బంగారం ముఠా సభ్యుల ఉచ్చులో పడవద్దు. ఒక వేళ మోసపోతే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయండి. నేరస్తులను పట్టుకుని శిక్షపడేలా చేస్తాం. మోసం జరగక ముందే అప్రమత్తంగా ఉండాలి.

- ఈ.శ్రీనివాసులు డీఎస్పీ, ఏలూరు డివిజన్

సైబర్ కేటుగాళ్లు

ఆర్థిక నేరాలకు కొత్త పంథా

▸▸ అందమైన యువతులతో చాటింగ్ అంటూ లింకు ▸▸ క్షణాల్లో లక్షల రుణమంటూ సమాచారం



నరసాపురం, జూలై 21: సైబర్ కేటుగాళ్లు మోసగించడంలో రూట్ మార్చారు, గతంలో మాదిరిగా ఓటీపీలు అడగడం లేదు, మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని క్షణాల్లో ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారు. కష్టాల్లో ఉన్న మిమ్మిల్ని ఆర్థికంగా ఆదుకుంటామని నమ్మబలికి లింకులు పంపుతున్నారు. వీటిని క్లిక్ చేస్తే మీకు రుణం అందుతుందని ఆశచూపి కొట్టేస్తున్నారు. క్లిక్ చేయగానే మన ఖాతాల్లోని సొమ్మంతా మాయమైపోతుంది. ఈవిధంగా మోసపోయిన వాళ్లు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. గతంలో ఈ మోసాలు వేరేవిధంగా ఉండేవి, బ్యాంకు అధికారుల మంటూ ఫోన్ చేసి వివరాలు సేకరించేవారు. మీ ఏటీఎం, క్రెడిట్ కార్డుల అప్‌డేట్ చేస్తున్నామని నమ్మబలికి ముందుగా మన వివరాలన్ని చెప్పేవారు. ఇవన్నీ కరెక్ట్‌గా ఉండడంతో బ్యాంకు అధికారులని నమ్మి ఓటీపీ చెప్పేవారు. అంతే ఖాతాల్లో సొమ్ము మాయమయ్యేవి. ఇది అందరికీ తెలిసిపోవడంతో కేటుగాళ్లు ఈ మోసాల్లో కొత్త పంథా ఎంచుకున్నారు. ఎక్కువగా రుణం తీసుకున్న వారి వివరాలను సేకరించి ముందుగా వారికి లింకు పంపుతున్నారు. క్లిక్ చేయగానే ఖాతాల్లో సొమ్ము కనిపించడం లేదు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఈ తరహా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు.

వీటితో పాటు అందమైన మహిళలతో వీడియో కాల్స్ చేయిస్తున్నారు. ముందుగా మాట కలిపి నూడ్ కాల్స్‌కు రెచ్చగొడుతున్నారు. ఏమాత్రం ఆకర్షితులైనా చాలు వాటిని రికార్డు చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడి డబ్బులు గుంజుతున్నారు. ఇది కాకుండా కొత్తగా నార్కోటిక్ అధికారులమంటూ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు.. మీరు విదేశాల నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్నారనే సమాచారం మా దగ్గర ఉంది, అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. చాలామంది ముందుగా వీరు చెప్పిన వివరాలన్నీ కరెక్ట్‌గా ఉండంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విధమైన మోసాలతో ప్రజలు భయంతో బెంబేలెత్తిపోతున్నారు.

■ జిల్లాలో ఆయన ఓ ముఖ్య రాజకీయ నాయకుడు, మాజీ ప్రజాప్రతినిధి కూడా.. గత నెలలో ఆయనకు ఒక ఫోన్ కాల్ వచ్చింది, ముంబై నుంచి నార్కోటిక్ అధికారులమంటూ ఫోన్ చేసి.. ముందుగా ఆయన ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో పాటు అడ్రస్ చెప్పారు, ఇవన్నీ మీవేనా.. ? అంటూ హిందీలో గద్దించారు. ఆ నాయకుడు కర్టెన్ అని సమాధానం ఇచ్చారు.. అంతే.. మీరు విదేశాల నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకుంటున్నారు, మా దగ్గర పూర్తి సమాచారం ఉంది, మేము వచ్చి మిమ్మిల్ని అరెస్టు చేస్తున్నామంటూ బెదిరించారు, అయితే వారు నార్కోటిక్ అధికారులమని హిందీలోనే మాట్లాడారు.. ఇంగ్లీషులో మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి నిలదీశాడు పోలీస్ రిపోర్ట్ ఇస్తానని బెదిరించడంతో వెంటనే ఫోన్ కట్ చేశారు.

■ నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం కాక ముందు ఇతర రాష్ట్రాల ఫోన్ కాల్స్ వచ్చేవి, ఆ నెంబర్లు చూస్తే చాలు ఆయన భయంతో బెంబేలెత్తిపోయేవారు. అవతల వ్యక్తులు డబ్బు పంపించాలని బెదిరింపులకు పాల్పడే వారు. వీటిని తట్టుకోలేక సిబ్బంది, కుమారుడి నుంచి అప్పుచేసి రూ.3 లక్షలుపైనే పంపారు. ఈ ఫోన్ కాల్స్ వస్తాయన్న భయంతో ఆయన తన చాంబర్‌లో కూర్చోకుండా సిబ్బంది మధ్యే కూర్చుని పని చేసేవాడు. సైబర్ నేరగాళ్లే ఆయనని బెదిరింపులకు పాల్పడి ఉండవచ్చన్న వాదనలు పోలీస్‌ల నుంచి వినిపిస్తున్నాయి.

■ నరసాపురం పట్టణానికి చెందిన ఒక వ్యక్తికి పది రోజుల క్రితం రాత్రి పూట వీడియో కాల్ వచ్చింది. వెంటనే అతను ఫోన్ ఆన్‌చేయగా.. ఒక యువతి నగ్నంగా కనిపించింది, ఇంగ్లీష్‌లో వీడియో కాల్ ఆన్ చేసిన వ్యక్తిని నువ్వు కూడా డ్రస్ విప్పి నాతో ఎంజాయ్ చేయాలంటూ ఉసిగొల్పింది, వెంటనే తేరుకున్న ఆ వ్యక్తి కాల్‌కట్ చేశారు, లేక పోతే హనీ టాప్‌లో చిక్కుకునే వాడు.

■ భీమవరం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికి ఓ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ పేరుతో సమాచారం వచ్చింది. క్షణాల్లో రూ.10లక్షల రుణం వివరాలు చేస్తే ఖాతాలో సొమ్ముఅంటూ మేసేజ్‌లో సారాంశం ఉంది. అప్పటికే సైబర్ నేరాలపై అవగాహన ఉన్న ఆ వ్యక్తి ఫోన్‌లో ఉన్న లింకును క్లిక్ చేయలేదు, చేసి ఉంటే బ్యాంకు ఖాతాల్లో సొమ్మంతా మాయమయ్యేది.

లింకులు క్లిక్ చేయొద్దు..



వాట్సాప్‌లకు వచ్చే మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దు.. తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్ మాట్లాడొద్దు.. రుణాల పేరుతో ఎవరైనా ఫోన్ చేస్తే సమాచారం చెప్పొద్దు.. ముందుగా సైబర్ నేరగాళ్లు మనకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా సేకరిస్తారు, ఆ తరువాతే మనల్ని బెదిరించి డబ్బు డిమాండ్ చేస్తారు. వారు చెప్పిన వివరాలు కరెక్ట్‌గా ఉన్నాయని తెలిసినా.. భయపడకుండా సమాధానం చెప్పాలి. వెంటనే సైబర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలి, ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్‌స్టేషన్ ఉంది.

- శ్రీనివాస్, డీఎస్పీ, నరసాపురం

రైతు ఖాతా నుంచి రూ.6 లక్షలు మాయం

పాలకోడేరు, జూలై 21: గరగపర్రు గ్రామానికి చెందిన రైతు తన యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.6లక్షలు మాయం అయ్యాయి అంటూ పాలకోడేరు పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతు కశ్యవరహావతారం కుటుంబ అవసరాల కోసం పొలం అమ్మగా వచ్చిన సొమ్ము రూ.8లక్షలు గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఖాతాలో దాచుకున్నాడు. శుక్రవారం బ్యాంకువారు పంపినట్టుగా రైతు ఫోన్‌కు లింకు వచ్చింది. ఆ లింకు ఓపెన్ చేయగా దఫదఫాలుగా ఆదేరోజు అతడి ఖాతా నుంచి రూ.6 లక్షలు మాయం అయ్యాయి. రైతు లబోదిబోమంటూ పాలకోడేరు పోలీసులను ఆశ్రయించాడు. పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



రూ.6 లక్షలు మాయమయ్యాయని సెల్ మెసేజ్ చూపిస్తున్న రైతు





కుక్కునూరు.. వేలేరుపాడులో గర్భిణులను ఆసుపత్రులకు తరలిస్తున్న సిబ్బంది

ప్రభుత్వాసుపత్రికి గర్భిణుల తరలింపు

▸▸ వైద్య శిబిరాల ఏర్పాటు.. అదనంగా వైద్య సిబ్బంది నియామకం

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 21: భారీ వర్షాలు, వరదల కారణంగా ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గర్భిణులు, బాలింతలను ముందు జాగ్రత్తగా ప్రభుత్వాసుపత్రికి తరలించామని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తెలిపారు. ఆదివారం కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వేలేరుపాడు మండలానికి చెందిన తొమ్మిది మాసాలు నిండిన సీత అనే గర్భిణిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. వరద బాధితులకు అందుతున్న వైద్యసేవలను ఆమె ఆరా తీశారు. కుక్కునూరు, వేలేరుపాడులలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాలకు 28 వైద్య సిబ్బందిని నియమించామన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచామన్నారు. డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాల నుంచి 16 మందిని వైద్య సేవల నిమిత్తం వినియోగిస్తున్నట్టు తెలిపారు.

'చెస్‌తో పిల్లల్లో ఏకాగ్రత పెంపు'



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న భూపతిరాజు ప్రవీణ్

భీమవరం అర్బన్, జూలై 21: చెస్‌తో పిల్లల్లో ఏకాగ్రత, సృజనాత్మకత పెరగడంతో బాల మేధావులుగా అభివృద్ధి చెందుతారని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సతీమణి భూపతిరాజు ప్రవీణ్ అన్నారు. అంతర్జాతీయ చెస్‌దినోత్సవం సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం నర్సయ్య అగ్రహారంలోని ఏఆర్ఆర్ రెసిడెన్సీలో వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ ఫస్ట్ ర్యాంకింగ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను ఆమె ఆదివారం ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చదరంగంలో శిక్షణ ఇస్తున్న మాదాసు కిషోర్ మరింత మందిని అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ అందించాలన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదా సు కిషోర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన కార్తీక్, ఎ.శరత్, కుష్వంత్, ఎ.అంజలి,డి. భవిష్య, సాన్వి, వాగ్దేవ్ విజేతలుగా నిలిచిరన్నారు. ఈ విజేతలు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. చెస్ అసోసియేషన్ సభ్యులు అల్లూరి శివరామరాజు, డీఎస్ఆర్ ఇంగ్లీషు మీడియం ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, ఆర్.శ్రీనివాసరావు, మురళి, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.



బొత్స దంపతులు అందించిన బంగారుపూత హనుమద్వాహనానికి పూజలు



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న రాష్ట్ర మంత్రి శ్రీనివాస్



దాత రామకృష్ణంరాజు కుటుంబానికి బాండు అందిస్తున్న ఈవో త్రినాథరావు

చినవెంకన్నకు హనుమద్వాహనం అందజేత

ద్వారకాతిరుమల, జూలై 21: చిన్నతిరుమలేశునికి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీలక్ష్మి ఆదివారం బంగారు తాపడంతో తయారైన హనుమద్వాహనాన్ని ఆదివారం బహూకరించారు. విజయనగరానికి చెందిన బొత్స ఝాన్సీలక్ష్మి 230.500 కేజీల బరువున్న సుమారు రూ.32 లక్షలు విలువైన వాహనాన్ని కుటుంబంతో కలసి వచ్చి ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు సమక్షంలో అందించారు. తొలుత బొత్స దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో దుర్గారావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారికి మంత్రి శ్రీనివాస్ పూజలు

రాష్ట్ర మంత్రి హోదాలో చిన్న తిరుమలేశుని దర్శించుకోవడం పూర్వ పుణ్యఫలమని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆయన స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో దుర్గారావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. టీడీపీ నేతలు మొగతడకల శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఆర్.రాంబాబు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

వెంకన్న అన్నదాన ట్రస్టుకు రూ.4 లక్షల విరాళం

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ దాత కుటుంబం రూ.4 లక్షలు విరాళంగా అందించారు. భీమవరం సమీపంలోని మందలపర్రుకు చెందిన పొట్టూరి నాగ రామకృష్ణంరాజు ఈ విరాళాన్ని నగదు రూపంలో ఆలయ కార్యాలయంలో ఆదివారం చెల్లించారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఈవో వి.త్రినాథరావు విరాళం బాండు పత్రాన్ని, అందించి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి ఘనంగా సత్కరించారు.

బెంగాలీ కార్మికుడికి పాము కాటు



గిరిధర్ సర్దార్‌ను పరామర్శిస్తున్న సీపీఎం నేత కేతా గోపాలన్

పెనుగొండ, జూలై 21 : పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి పొట్ట చేత పట్టుకుని పొలం పనుల కోసం మన రాష్ట్రం వచ్చిన బెంగాలీ కార్మికుడు రక్త పింజరి అనే ప్రమాదకరమైన విష పాముకాటుకు ఆదివారం గురయ్యాడు. దేవ గ్రామంలో పంట చేను ఊడ్పుల కోసం ఆకుతీస్తున్న కార్మికుడి వేలిపై కాటు వేయంతో కార్మికుడు గిరిధర్ సర్దార్‌ను పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా అతడిని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ పరామర్శించి విషయం తెలుసుకున్నారు. కార్మికుడి వేలు రెండు అంగుళాలు విష ప్రభావంతో నల్లబడిందని అవసరమైన తక్షణ వైద్యం అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. విష ప్రభావానికి మెదడు, మూత్ర పిండాలు దెబ్బతినవచ్చని రక్తపు వాంతులు అవుతాయన్నారు. శరీరంలోకి వెళ్లిన విష ప్రభావాన్ని అంచనా వేసి అవసరమైన వెద్య సహకారం కోసం ఇతర ఆసుపత్రులకు సూచిస్తామన్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఇటీవలే వడలి గ్రామ సమీపంలో పాము కాటుకు గురైన బెంగాలి కార్మికుడు మృతి చెందాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాము కాటుకు గురవుతున్న కార్మికులకు ఇన్సూరెన్స్ పథకం ప్రవేశపెట్టాలన్నారు. సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, చిలుకూరి శ్రీనివాసరావు ఉన్నారు.

కన్నడ సంగీత దర్శకుడు సతీష్‌బాబు మృతి

▸▸ పలువురి సంతాపం.. ఉండిలో విషాదచాయలు



సతీష్‌బాబు (ఫైల్)

ఉండి జూలై 21 : ఉండి గ్రామానికి చెందిన కన్నడ సంగీత దర్శకుడు గడి సతీష్‌బాబు(49) ఆదివారం ఉండిలోని ఇంటి వద్దే అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కన్నడ సినిమారంగంలో పలుచిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు. గత ఏడాది కాలం నుంచి అనారోగ్యం కారణంగా సినిమాలకు దూరంగా వున్నారు. స్వగ్రామమైన ఉండి విచ్చేసి ఇక్కడనే వైద్యం పొందుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. భార్య, ఇరువురు కుమారులున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన తల్లి గడి జయలక్ష్మి మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు కావడంతో పలువురు రాజకీయ నాయకులు, అధికారులు ఆయనకు నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



బాలేపల్లిలో బ్రహ్మకమలాలు

వీరవాసరం, (భీమవరం టౌన్), జూలై 21 : వీరవాసరం మండలం బాలేపల్లి గ్రామంలో యర్రంశెట్టి వెంకటేశ్వరరావు (తాతాజీ) మాస్టార్ ఇంట్లో గురుపౌర్ణమి పర్వదినమున బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా పిలువబడే మూడు బ్రహ్మకమలాలు వికసించాయి. ఈ పుష్పాలను గ్రామస్థులందరూ తిలకించి ఆనందిస్తున్నారు. ఈ బ్రహ్మకమలాలను 'కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్' అని పిలుస్తారు. ఇటువంటి అరుదైన పుష్పం పవిత్రమైన గురుపౌర్ణమి రోజు తమఇంట్లో వికసించడం అదృష్టంగా భావిస్తున్నామని తాతాజీ మాస్టారు అన్నారు.

పదకొండు మంది జూదరుల అరెస్ట్

టి.నరసాపురం/నిడమర్రు, జూలై 21: టి.నరసాపురం, నిడమర్రు మండలాల్లో వేర్వేరుచోట్ల మొత్తం పదకొండు మంది జూదరులను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. టి.నరసాపురం మండలం బండివారిగూడెం గ్రామ పంచాయతీలో పేకాటాడుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో దాడి చేశామని ఎస్ఐ ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. దాడిలో ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. నిడమర్రు మండలం చానమిల్లి గ్రామంలో శనివారం రాత్రి పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామని నిడమర్రు ఎస్ఐ ఆర్.శ్రీను తెలిపారు. దాడిలో నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూలై 21 : నూజివీడు పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైందని నాయనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. నూజివీడు పట్టణానికి చెందిన బాలిక కొద్దిరోజుల క్రితం జంగారెడ్డిగూడెం పట్టణంలో నివాసం ఉంటున్న తన నాయనమ్మ ఇంటికి వచ్చింది. శనివారం ఉదయం బయటికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరక పోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ కానరాలేదు. ఆదివారం నాయనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

వృద్ధురాలిని తప్పించబోయి..

▸▸ ఆర్టీసీ బస్సును ఢీకొట్టి యువకుడి దుర్మరణం



సాయి కిశోర్ (ఫైల్)

పాలకొల్లు రూరల్, జూలై 21 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పాలకొల్లులోని బ్రాడీపేట బైపాస్‌రోడ్డులో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. మోటారుసైకిల్‌పై పాలకొల్లులోని తన పెదనాన్న ఇంటికి వెళ్లి వస్తున్న యాదల సాయి కిశోర్(21) ఒక వృద్ధు రాలిని తప్పించబోయి ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీ కొన డంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభు త్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణిం చినట్టు పట్టణ ఏఎస్ఐ ఏసుబాబు తెలిపారు. మృతుడు సాయికిశోర్ తండ్రి నరేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

మామను హత్య చేసిన అల్లుడి అరెస్ట్

ద్వారకాతిరుమల, జూలై 21 : మామను హత్య చేసిన అల్లుడిని 24 గంటలు గడువక ముందే పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కిపంపారు. ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భీమడోలు సీఐ బి.రవికుమార్ కేసును ఛేదించి ముద్దాయిని అతడి స్వగ్రామమైన జి.కొత్తపల్లిలో ఆదివారం మధ్యాహ్నం వలపన్ని పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాలివి.. ఐఎస్ జగన్నాథపురానికి చెందిన పాతకోకుల లాజర్(65) పెద్ద కుమార్తె గంగాభవానీని జి.కొత్తపల్లికి చెందిన సుబ్బారావుకిచ్చి పెళ్లి చేశారు. అల్లుడు వ్యసనాలకు బానిసై తన ఇద్దరు పిల్లలను భార్యను తరచూ హింసించడంతో భార్య పుట్టింటికి వెళ్లి తండ్రి వద్దే కూలిపనులు చేసుకుంటూ ఉంది. రెండు నెలల క్రితమే ఆమె తన కుమార్తెకు పెళ్లి చేసింది. కుటుంబపోషణ కష్టం కావడంతో కువైట్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంది. ఈ రెండూ తనకు తెలియకుండా జరగడంతో అహం దెబ్బతిన్న సుబ్బారావు భార్యను చంపేందుకు అత్తారింటికి వెళ్లి.. భార్య లేకపోవడంతో మామ లాజర్‌ను విచక్షణరహితంగా దాడి చేయడంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పరారైన అల్లుడు సుబ్బారావును 24 గంటలు గడవక ముందే సీఐ రవికుమార్ వలపన్ని పట్టుకున్నారు. కేసును సత్వరం చేధించిన పోలీసు అధికారులను ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

▸▸ రెండు లక్షలు నగదు, ఐదు కాసుల బంగారం అపహరణ

జంగారెడ్డిగూడెం, జూలై 21 : జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు, బంగారం దోచుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు తెలిపిన వివరాలివి.. పట్టణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో అడ్డూరి లోవరాజు అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ స్థానిక త్రివేణి కళాశాల వద్ద నివాసం ఉంటున్నాడు. ఈనెల 19వ తేదీన లోవరాజు తన భార్యతో కలసి అపార్ట్‌మెంట్ వద్దకు కాపలా నిమిత్తం వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లగా బీరువాలోని రూ.2లక్షలు నగదు, ఐదు కాసుల బంగారు ఆభరణాలు తస్కరించినట్టు గుర్తించారు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

10 కేజీల వెండి వస్తువుల చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణకుమార్

కైకలూరు, జూలై 21: కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో పది కేజీల వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు ఆదివారం గుర్తించారు. గ్రామానికి చెందిన పాలచర్ల సత్యన్నారాయణ చౌదరి కుమార్తె అమెరికాలో ఉండడంతో కొద్దిరోజుల క్రితం ఆయన అమెరికా వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో దుండగులు తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు పది కేజీల వెండి వస్తువులను చోరీ చేశారు. రెండు రోజుల్లో సత్యనారాయణ చౌదరి కైకలూరు వస్తున్నారనే సమాచారంతో పనిమనిషి ఇంటిని శుభ్రం చేసేందుకు ఆదివారం వెళ్లగా తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి వారి సోదరుడు ఏలేటి శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, టౌన్ ఎస్ఐ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 వరకు డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

ఏలూరు అర్బన్, జూలై 21 : ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం కోరుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 25 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు ఆదివానం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల, కోర్సు ఎంపికను ఈ నెల 26 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు.

సెక్యూరిటి గార్డు ఉద్యోగాలు

పోలవరం జూలై 21 : ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆదివాసీ మహాసభ కార్యదర్శి మూలెం రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు అర్హులని, నెలకు రూ.17 వేల జీతం పీఎఫ్ రూ.300 అదనంగా ఇవ్వబడుతుందని తెలిపారు. వసతి సౌకర్యం కల్పించబ డుతుందని ఎన్నికైన వారు గుంటూరు జిల్లా దాచేపల్లి ఏరియాలో సిమెంటు కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేయవలసి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు నెంబరు 8500 572538లో సంప్రదించాలని కోరారు.

జన సైనికుడి కుటుంబానికి ఆర్థిక సాయం


కృపాకర్ తల్లికి చెక్కు అందజేస్తున్న నాగబాబు

వేలేరుపాడు, జూలై 21: గతేడాది అక్టోబర్ 25న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త కృపాకర్ కుటుంబానికి మంగళగిరి జనసేన ప్రధాన కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రభాకర్ తల్లి విజయలక్ష్మికి జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు రూ. ఐదు లక్షల చెక్కు అందజేశారు. జనసేనలో చేరిన ప్రతి కార్యకర్త తమ కుటుంబ సభ్యులేనని నాగబాబు అన్నారు. జనసేన మండల అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన డీఎస్సీ-98 ఉపాధ్యాయులు


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఏలూరు అర్బన్, జూలై 21 : తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని 1998 డీఎస్సీ సెలెక్టెడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రాన్ని అందజేశామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ ఆదివారం తెలిపారు. తమకు ఏడాదికి 11 నెలల జీతాన్ని మాత్రమే చెల్లిస్తున్నారని, 12 నెలల జీతాన్ని ఇప్పించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించా మన్నారు. స్పందించిన సీఎం మెమోరాండంపై సంతకంచేసి ఫైలును విద్యా శాఖకు పంపాల్సిందిగా ఆదేశించారని సంఘ నాయకులు రాజేంద్రప్రసాద్, భానుమూర్తి, జి.రెడ్డి, ఎ.రాజు, కె.స్వామిదాసు తెలిపారు.

24న ఆటోనగర్ కమిటీ ఆత్మీయ సమావేశం

ఏలూరు రూరల్, జూలై 21: ఏలూరు టౌన్ ఆటో మొబైల్ మెకానిక్ అసోసియేషన్ కమిటీ సమావేశం ఆదివారం మల్కాపురంలోని ఆటోనగర్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ ఆవిర్భావం నుంచి మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణరావు అనేక అవకతవకలకు పాల్పడినందున, గతేడాది తొలగించి పాత కమిటీలను రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ నాగభూషణం సభ్యత్వాన్ని తొలగిస్తూ తీర్మానించినట్లు తెలిపారు. గత తొమ్మిది నెలల కాలంలో జరిగిన పరిణామాలను చర్చించేందుకు ఈ నెల 24న ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గౌరవాధ్యక్షుడు ఎమ్డీ సులేమాన్, కర్రి ఈశ్వర్‌రావు, ఎం.సత్యనా రాయణ, సయ్యద్ చోటే, జీవీ సూర్యనారాయణ, బి.ప్రతాప్, రాంబాబు, సంజీవరావ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఏలూరు క్రైం, జూలై 21 : ప్రజా శాంతికి భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లకు జిల్లా పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ శివకిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు సంబంధిత ఎస్ఐలు, సీఐలు, డీఎస్పీలు ఆదివారం ఉదయం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రౌడీ షీటర్‌పై నిఘా ఉందని ఏ మాత్రం గొడవలకు పాల్పడినా అవసరమైతే జిల్లా బహిష్కరణ కూడా చేసే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేశారు. సమాజంలో మంచి జీవితాన్ని గడపాలని సూచించారు.

● కామవరపుకోట : మండలంలోని రౌడీషీటర్లకు తడికలపూడి పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ జయబాబు కౌన్సెలింగ్ ఇచ్చారు.ప్రవర్తన మార్చుకోక పోతే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలం

ఏలూరు కార్పొరేషన్, జూలై 21 : ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తు లకు అనుకూలమైన విధా నాలను త్వరితగతిన అమ లు చేసేందుకు ప్రయత్ని స్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్ అన్నారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఆదివారం జరిగిన ఏలూరు జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే అధ్యక్షత వహించారు. ఓబులేష్ మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేటీకరణ విధానాలపై రానున్న రోజుల్లో పోరాటాలను విస్తృత పర్చేందుకు సెప్టెంబర్ ఒకటి నుంచి మూడు రోజులపాటు విశాఖ నగరంలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. నాయకులు కంకిపాటి బుచ్చి బాబు, కె.కృష్ణమాచార్యులు, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఏలూరులో వంద పడకలతో ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని, మినిమం వేజ్‌బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించారు.

జగన్‌కు మతిభ్రమించింది

ఏలూరు టూ టౌన్, జూలై 21 : అధికారం కోల్పోవడంతో జగన్‌కు మతిభ్రమించి ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 36 రాజకీయ హత్యలు జరిగాయని తప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో నాలుగు రాజకీయ హత్యలు జరిగితేదానిలో ముగ్గురు టీడీపీ కార్య కర్తలే చనిపోయారని అన్నారు. ప్రజలు ఛీకొట్టిన వైసీపీ నేతలు బుద్ధి మారటం లేదన్నారు. వారు చెప్పే అబద్ధాలకు అదుపులేకుండా పోతుందన్నారు. సిగ్గులేకుండా ఢిల్లీ వెళ్ళి ధర్నా ఏం ముఖంపెట్టుకుని చేశాడని దుయ్యబట్టారు.

వెండి తొడుగు సమర్పణ

దెందులూరు, జూలై 21 : చల్లచింతలపూడి శ్రీమేధా దక్షిణామూర్తి స్వామికి పసుమర్తి శ్రీలక్ష్మీ, కృష్ణప్రసాద్ రూ.లక్ష 50 వేల విలువ చేసే కేజీ నర వెండితో తయారు చేసిన తొడుగు చేయించి ఆదివారం ఆదివారం ఆలయ అర్చకులు ప్రసాద్‌కు అందజేశారు.

తాగునీరు ఏర్పాటు

వేలేరుపాడు, కుక్కునూరు, జూలై 21 : భారీ వర్షాలు వరదల కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తాగునీటి అవసరాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సూపరిండెంటెండ్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు. వరద ప్రభావిత 12 గ్రామాల్లో మూడు రోజులుగా రెండు లక్షల వాటర్ ప్యాకేట్లు పంపిణీ చేశామన్నారు. 18 ట్యాంకుల ద్వారా నీరందించామన్నారు. మరో 50 వేల వాటర్ ప్యాకేట్లు, 14 నివాస ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు.. అలాగే దాచారం పునరావాస కాలనీలో ఐదు చేతి బోర్లు ఏర్పాటుతో పాటు మోటర్ కూడా ఏర్పాటు చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లో 13 టెంపరరీ మరుగుదొడ్లు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వీడని వర్షం

కొయ్యలగూడెం, జూలై 21: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం ఆదివారం కూడా కురిసింది. దీంతో రోడ్లన్నీ బురదమయమయ్యాయి. రాజవరంలోని యర్రకాల్వ పొంగి పొర్లుతూనే ఉంది. యర్రకాల్వ జలశయం గేట్లు ఎత్తివేయడంతో ఈ కాల్వ వేగంగా ప్రవహిస్తుంది. కాల్వ వెంబడి ఉన్న పొలాల్లోకి వరదనీరు పొలాలను ముంచింది. ఇసుక మేటలు వేసేసిందని రైతులు వాపోతున్నారు. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు యధావిధిగానే ఉంది.


ఎనికేపల్లిలో అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు


కమ్మరగూడెంలో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్


టీడీపీ నాయకులు సేకరించిన నగదును ఎంపీ మహేష్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్


కమ్మరగూడెంకి ట్రాక్టర్ పై వెళ్తున్న ఎంపీ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బాలరాజు తదితరులు

అండగా ఉంటాం

» ముంపు ప్రాంతాలలో ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన » నిత్యావసర సరుకుల పంపిణీ

వేలేరుపాడు, జూలై 21: పెదవాగు ప్రాజెక్టుకు గండిపడి వరద ఒక్కసారిగా వచ్చిపడటంతో సర్వం కోల్పోయిన కమ్మరిగూడెంలో ఆదివారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, సొంగా రోషన్‌కుమార్, టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. వరద ప్రమాదంపై గ్రామస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న సాయం పై ఆరా తీశారు. ఇళ్లు కొట్టుకు పోవడంతో నిరాశ్రయులమయ్యామని మిగిలిన ఇళ్ల వద్ద తాత్కాలిక ఆశ్రయం పొందుతున్నామని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని ఎంపీకి మొరపెట్టుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ మెరక ప్రాంతంలో ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తుందని తెలిపారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొలాల్లో మేటలు వేసిన ఇసుకను తొలగించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆహారం తాగునీటి సదుపాయం, వైద్యసహాయం అందజేస్తామన్నారు. బాధితులను పరామర్శించేందుకు ప్రజాప్రతినిధులు కమ్మరగూడెంనకు ట్రాక్టర్‌పై వెళ్లారు. కమ్మరగూడెం వరద బాధితులకు ఎంపీ ఆధ్వర్యంలో అప్పలరాజుగూడెం యూత్ నాయకులు గన్నేరి సురేంద్ర చౌదరి, ఆధ్వర్యంలో 300 మందికి భోజనాలు 170 కుటుంబాలకు, వేలేరుపాడు మండల టీడీపీ తరఫున అమరవరపు అశోక్ ఆధ్వర్యంలో 120 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఏలూరు జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, పోలవరం, చింతలపూడి, ఎమ్మెల్యేలు చిర్రి బలరాజు, సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళీరామకృష్ణ, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల టీడీపీ నాయకులు అమరవరపు అశోక్, నాగేశ్వరరావు, కొమ్మన వెంకటేశ్వరరావు, కరుటూరి రాధాకృష్ణ, సుధాకర్, కనకారావు, దొరబాబు, ముత్యాలరావు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : వరదలకు నష్టపోయిన ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ అన్నారు. పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ గృహానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ విచ్చేశారు. ఏజెన్సీలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్తూ ఇక్కడ కొద్ది సేపు ఆగి అల్పాహారం చేసి వెళ్లారు. కొండ్రెడ్డి కిషోర్, కాకర్ల కిషోర్, చిట్టూరి సతీష్, చిట్టూరి దశరథ్, ఆలపాటి నాని, ఇనుగడప రామాంజనేయులు, కూచిపూడి రమేష్ తదితరుల ద్వారా సేకరించిన రూ.లక్షా 20 వేల నగదును ఎమ్మెల్యే రోషన్ కుమార్ చేతుల మీదుగా ఎంపీ మహేష్‌కు అందచేసి వాటిని వరద ముంపు గ్రామాల ప్రజలకు వినియోగించాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, నాయకులు పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, పాతూరి అంబేడ్కర్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, అబ్బిన దత్తాత్రేయ, మున్సిపల్ కౌన్సిలర్ లు కరటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, పగడం సౌభాగ్యవతి, చంటి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● తమ గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని గురవాయిగూడెం టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కలిసి విన్నవించారు. వర్షాలకు ఎస్సీ, బీసీ కాలనీలోని ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలపగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిటికెన శ్రీనివాసరావు, మారిశెట్టి హరిబాబు ఉన్నారు.

● ఉంగుటూరు : మండలంలోని రావులపర్రు, నాచుగుంట, కైకరం గ్రామాల పరిధిలోని వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు. ఏడీఏ పి.ఉషారాజ కుమారి, ఏవో బాలిన వెంకటేష్ మాట్లాడుతూ మండలంలో 16.74 ఎకరాలలో నారుమడులు, 3,364 ఎకరాలలో వరి నాట్లు నీట మునిగాయన్నారు. ప్రజా ప్రతినిధులు, టీడీపీ నేతలు ఇమ్మణ్ణి గంగాధరరావు, వట్టి పవన్, పంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు : నీట మునిగిన పంట పొలాల నష్టపరిహారాలు త్వరితగతిన గుర్తించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అధికారులను ఆదేశించారు. రాయన్నపాలెం, ఎంఎంపురం, సాయన్నపాలెం, గుండుగొలను, లింగంపాడు ప్రాంతాల్లో నీట మునిగిన వరి పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈదురు గాలులలకు కూలిపోయిన చెట్లను ఆయన ఆదేశాల మేరకు అధికారులు తొలగించారు. అనంతరం తోకలపల్లి బ్రిడ్జి సమీపంలో ఉన్న ప్రధాన డ్రెయిన్‌లో గుర్రపు డెక్కను తొలగించాలని అధికారులను ఆదేశించారు. నారుమడులు కుళ్లి పోయాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : వేలేరుపాడు వరద ముంపు బాధితుల్ని పరామర్శించేందుకు వెళుతున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు కూటమి నాయకులు సమస్యలు విన్నవించారు. లక్ష్మీపురం ఏడు కన్నాల తూము వద్ద ఏటా వరదలు సమయంలో కొట్టుకుపోతున్న కాలువగట్టు రహదారి పరిస్థితి వివరించారు. జగదాంబ ఆలయం వద్ద ఎంపీకి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జాతీయ రహదారి పరిస్థితిని చూపించారు. మండల టీడీపీ అధ్యక్షులు సుంకవల్లి సాయి, తదితరులున్నారు.

● నిడమర్రు : వర్షాలకు నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు భరోసా ఇచ్చారు. భువ్వనపల్లి, ఎనికేపల్లి, అడవికొలనులలో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు. వ్యవసాయ, ఇరిగేషన్, డ్రైన్లు శాఖాధికారులకు మురుగునీరు పోయేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఏడీఏ ఉషాకుమారి, ఏవో గీతాదేవి , కూటమి నేతలు నిమ్మల దొరబాబు, పోశింశెట్టి రాంమూర్తి, జవ్వాది బాలాజి, నిమ్మల మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాల్లో వ్యవసాయాధికారులు

బుట్టాయగూడెం, జులై 21 :మండలంలోని కోయరాజమండ్రి, అచ్చియ్యపాలెం, నూతిరామన్నపాలెం, లక్ష్యుడుగూడెం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఆదివారం పర్యటించి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. కోయరాజమండ్రిలో కూరం చల్లయ్య అనే గిరిజన ఐదేకరాల్లో మొక్కజోన్న పంట వేయగా ఎకరం భూమిలోని పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. ఇతర దెబ్బతిన్న పంటలను పరిశీలించి వర్షాలు తగ్గడంతో రైతులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. పొలాల్లో ఉన్న నీరు బయటకు పోయేలా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. చల్లని వాతావరణం వలన వరి నారుమడులకు తెగుళ్ల వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎకరాకు కార్బెండిజమ్ గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే 20 కిలోల యూరియా 20 కిలోల పొటాష్‌తో కలిపి ఎకరం భూమిలో వెదజల్లాలని సూచించారు. వరినాట్లు వర్షాలు తగ్గాక వేయాలని నాట్లు వేసే ముందు నీటిని బయటకు పంపి బురద పదును ఉండుటట్లు చూసుకోవాలన్నారు. అధిక వర్షాలకు పంటలు దెబ్బతింటే రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సహాయకులకు తెలియజేయాలని తెలిపారు. 83310 56714 నెంబరు ద్వారా ఏవోకు కూడా తెలపవచ్చి తెలిపారు. వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.


లింగంపాలెంలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

● లింగపాలెం : వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో వరిపంటలో నీరు ఎక్కువగా నిలువకుండా చూసుకోవాలని, నీరు ఎక్కువగా ఉంటే వెంటనే తొలగించాలని ఎంఏవో కోటగిరి మురళీకృష్ణ అన్నారు. యడవల్లిలో ఆయన నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపొలాల్లో నీరు ఎక్కువగా నిలిస్తే పంటలు పాడైపోతాయని, దానివల్ల పంటనష్టం చేకూరుతుందని ఆయన అన్నారు. ఆయనతో పాటు పలువురు రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి


నీటమునిగిన నారును పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఏలూరు రూరల్, జూలై 21: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తంగెళ్ళ మూడి, కొమడవోలు ఆయకట్టు పరిధిలో ముంపునకు గురైన వరి పంట పొలాలను ఆదివారం సంఘ నాయకులు పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎకరానికి రూ.15 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు జి.సాంబశివరావు, లావేటి శ్రీనివాసరావు, భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, రాఘవరాజు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : మండలంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేసింది. రెండు రోజుల పాటు నీట ముని గిన చేలను పరిశీలించారు. కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి రాఘవులు, మండల అధ్యక్షులు కడియాల ప్రేమ సాయి,చింతపల్లి నారాయణ రెడ్డి ,కాండ్రు వెంకటరత్నం, మార్కండేయులు, నాగరాజు, పత్తిపాటి సాంబయ్య పాల్గొన్నారు.

ముంపులోనే పంట పొలాలు

చింతలపూడి, జూలై 21 : మండలంలోని వరి పొలాలు ఇంకా ముంపు నీటిలోనే ఉన్నాయి. చెరువులు అలుగులు పడటంతో వరదనీరు కొనసాగుతోంది. మండలంలో చెరువులు అనుసంధానం కలిగి ఉంటాయి. ఒక్క చెరువు నిండితే అదనపు నీరు దిగువ చెరువుకు వస్తుంది. ఈ విధంగా మండలంలో వాగుల ప్రవాహంతో పాటు చెరువులో అలుగులు పడిన నీరు పోయేందుకు కాలువలు పూడుకుపోవడంతో పొలాలు ముంపునకు గురవుతున్నాయని ఆయాకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 20 శాతం మేరకు మాత్రమే వరినాట్లు పడ్డాయి. ఇప్పుడు ఈముంపువల్ల కొన్ని పొలాలు దెబ్బతింటాయని, ఒక పక్క వ్యవసాయ కూలీలు దొరక్క వెదజల్లే విధానంతో వరిసాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, వీటిని తొలగించాలని, చెరువుల్లో పూడికలు తీయటం వల్ల నీటి సామర్థ్యం పెంచాలని కోరుతున్నారు. అధికవర్షాలు వల్ల ముంపు బారిన పడటానికి చెరువుల్లో ఆక్రమణే ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు వీటి పై దృష్టిపెట్టి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వరద బాధితులకు సాయం

జీలుగుమిల్లి, జూలై 21 : వేలేరుపాడు మండలంలో వరద ప్రభావంతో ముంపు ప్రాంత బాధితులకు సుమారు 500 మందికి జీలుగుమిల్లి ట్రక్కు ఆటో యూనియన్ సభ్యులు సాయం అందజేశారు. ఈ క్రమంలో మేడిపల్లి, కమ్మరగూడెం, గ్రామాల్లో పర్యటించి ఆహారం రొట్టెలు తాగునీరు అందజేశారు. యూనియన్ అధ్యక్షులు జి.జనార్ధన్, సభ్యులు రాంబాబు, మనోజ్, పుల్లారావు, నాగరాజు, సునీల్, నరసింహ, శ్రీను, తదితరులున్నారు.

ప్రజలకు అండగా ఉండండి

కామవరపుకోట, జూలై 21 : భారీ వర్షాలు, వరదల వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఈ తరుణంలో ప్రజలకు అండగా ఉండాలని కూటమి నాయకులు అంతా ఐకమత్యంగా ప్రజలకు సేవలు అందించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం వేలేరుపాడు వెళ్తుండగా మార్గ మధ్యలో కొత్తూరులోని ఒక బంకు వద్ద స్థానిక నాయకులను కలుసుకుని వివిధ సమస్యలపై కొద్దిసేపు చర్చించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, మండల తెలుగుదేశం అధ్యక్షులు కిలారు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో జర భద్రం

ఏలూరు టూ టౌన్, జూలై 21: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు. ఆదివారం వర్షాల కారణంగా ముంపునకు గురైన పలు ప్రాంతాల్లో వెంకటకృష్ణ పర్యటించారు. దోమలు ప్రభలకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నామన్నారు. 5వ డివిజన్‌లో చెంచుకాలనీ చుట్టుపక్కల కాలనీల్లో పర్యటించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాలస్వామి, ఎంఈ కొండ్రావు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం


అమ్మ అపార్ట్‌మెంటు వద్ద పేరుకుపోయిన చెత్త

ద్వారకాతిరుమల, జూలై 21: జోరుగా కురుస్తున్న వర్షాలు.. ప్రతికూల వాతావరణ పరిస్థితులు.. వీటికి తోడు పంచాయతీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం.. వెరసి పల్లెసీమల్లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయి. చెత్తను తరలించే వాహనాలు లేకపోవడంతో ద్వారకాతిరుమల పంచాయతీలో అపారిశుధ్యం తాండవిస్తోంది. స్థానిక కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో ఉన్న అమ్మ అపార్ట్‌మెంట్ వద్ద గుట్టలుగా పేరుకున్న చెత్త తరలించేందుకు పంచాయతీ అధికారులు చొరవ చూపడం లేదు. పంచాయతీకి పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ.. పరిశుభ్రతగా ఉంచడంపై లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్చకుల వీధిలో చెత్త పేరుకుని వర్షాలకు మురుగుగా మారుతోంది. పలుప్రాంతాల్లో డ్రెయినేజీల్లో నీరుకు చెత్త అడ్డుపడి సక్రమంగా పారడం లేదు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న డ్రెయినేజీలో చెత్త తీయకపోవడంతో మురుగు నీటికి దోమలు విజృంభిస్తున్నాయని, భయంతో కాలం గడుపుతున్నట్లు స్థానికులు అంటున్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

పెదవేగి, జూలై 21 : విజయరాయి శివారు గాంధీనగర్‌లో శ్రీషిర్డి సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు ఆయుష్ ఆస్పత్రి సహకారంతో ఆలయ దగ్గర ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె, మధుమేహం, నేత్రాలు, బీపీ తదితర వ్యాధులకు సంబంధించి, పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందించారు. ఆలయ కమిటీ ఆర్గనైజర్ కోనేరు అమరవాణి, వైద్యులు ప్రవీణ్, సాయికృష్ణ, రమ్య భానుకిరణ్ వైద్యసేవలు అందించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బలుసు ప్రసాద్, సభ్యులు పి.అప్పారావు, రావిపాటి పిచ్చియ్య చౌదరి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● లింగపాలెం : మండలంలోని కె.గోకవరంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, దగ్గుజలుబు లాంటి వాటితో పాటు ఎటువంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా వెంటనే దగ్గర్లోని ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించాలని డాక్టర్ కృష్ణకిషోర్ సూచించారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● వేలేరుపాడు : కమ్మరగూడెంలో మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 72 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ ఆకీబ్, హెల్త్ అసిస్టెంట్ దొర, ఏఎన్ఎం ఉషా, విజయ పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో వేమగిరికి చెందిన యోగానంద నేత్ర వైద్యశాల వైద్య నిపుణులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 171 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. 22 మందికి శస్త్రచికిత్సలు అవసరమని సిఫార్సు చేశారు. 36 మందికి కళ్లజోళ్ల సబ్సిడీపై అందచేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు, పిల్లి పండరీనాథ్, బొలిశెట్టి సురేష్‌కుమార్, చెన్నా వెంకట్రామయ్య, విఠల్ బృందం శిబిరంలో సేవలు అందించారు.


విజయరాయిలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు

● లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఒక ప్రైవేటు భవనం వద్ద జరిగిన లయన్స్ క్లబ్ కార్యక్రమంలో పలువురికి వినికిడి యంత్రాలను 316 జి గవర్నర్ అందచేశారు. కార్యక్రమంలో చిగురుపాటి వరప్రసాదరావు, మానేపల్లి రామారావు, కాకరాల వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు



ఏలూరు కార్పొరేషన్/ఏలూరు అర్బన్/ జంగారెడ్డిగూడెం/పోలవరం/ ఉంగుటూరు/ ద్వారకాతిరుమల/ కామవరపుకోట/ జీలుగుమిల్లి/ కొయ్యలగూడెం/ పెదవే గి/ భీమడోలు జూలై 21 : సనాతన ధర్మంలో గురువులను దేవునితో సమానంగా భావిస్తారు. ఏటా ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురు పౌర్ణమిని జరుపుకుంటారు. వేదాలను రచించిన వేద వ్యాసుని జయంతి ఈ రోజే. జిల్లాలోని షిరిడీ సాయి మంది రాలలో గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అన్న సమారాధనలు నిర్వహించారు. గురువులను సత్కరించారు. ఉంగుటూరు మండలంలోని కొవ్వలి సాయిబాబా ఆలయంలో 16 రకాల ప్రసాదాలను అందజేశారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యేలు ధర్మరాజు, చింతమనేని, బడేటి చంటి, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, తదితర ప్రముఖులు బాబా వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ట్రిపుల్ ఐటీకి తొమ్మిది మంది విద్యార్థులు

టి.నరసాపురం, జూలై 21: అలవ్వరాజుగూడెం గురుకుల పాఠశాలలో చదివి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులను, తల్లిదండ్రులను సిబ్బంది, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకర్‌రావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ రాంబాబు, నరేష్, పాఠశాల తల్లిదండ్రులు కమిటీ ఛైర్మన్ ఉప్పులూరి ప్రసాద్‌బాబు, గ్రామ పెద్దలు గుడ్ల శ్రీరామ్మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూలై 21: పత్తేబాదలో వేంచేసి ఉన్న కనక దుర్గమ్మ ఆలయం వద్ద ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అమ్మ వారికి ఎమ్మెల్యే చంటి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ నాయుడు పృథ్వీ శారద, క్లస్టర్ ఇన్‌చార్జి సోము, ఆలయ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అదనపు పొగాకుపై పన్ను లేకుండా చూడాలి

జంగారెడ్డిగూడెం, జూలై21 : పొగాకు రైతులు అదనంగా పండించిన పొగాకు అమ్మకాలపై పన్ను విధించకుండా చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా సుధాకర్‌ను పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ, అల్లూరు రామకృష్ణ కోరారు. ఆదివారం జంగారెడ్డిగూడెం విచ్చేసిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పొగాకు రైతుల సమస్యలను వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ పొగాకు రైతులు కొంతమంది ఢిల్లీ వస్తే కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ వద్దకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్లు రావూరి కృష్ణ తెలిపారు. పెనుమర్తి రామకుమార్, తూటిగుంట రాము, తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలు

ఏలూరు రూరల్, జూలై 21: అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా అబ్రహం, గ్యారికాస్పారొ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తంగెళ్ళమూడి, సిద్ధార్థ విద్యాలయ స్కూల్ ప్రాంగణంలో మండల స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను న్యాయవాది ఎస్.కాత్యాయిని ప్రారంభించారు. విజేతలకు ప్రశంసాపత్రం, మెమెంటోలు అందజేశారు. అకాడమి డైరెక్టర్ జి.యోహానంద్ పర్యవేక్షించారు.

● జంగారెడ్డిగూడెం : అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని దివ్యాన్ మాస్టర్ చెస్ అకాడమీ, శ్రీహంస చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వేర్వేరుగా టోర్నమెంట్స్ నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ఆదివారం ముఖ్య అతిథులు రోటరీ అధ్యక్ష కార్యదర్శులు ఊడా రాంగోపాల్, భవిరిశెట్టి హనుమాన్ తిలక్, వివేకా నంద ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ ఆర్వీ రాజు అందచేశారు. దివ్యాస్ మాస్టర్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్ అయినపర్తి సరళ మాధవి, హంస చెస్ అకాడమీ కోచ్ నాగు కన్నా పాల్గొన్నారు.

వాహనాలకు వేలం

జంగారెడ్డిగూడెం, జూలై 21 : స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో పలు నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 24న వేలం వేయనున్నట్లు ప్రాంతీయ రవాణాధికారి మదాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.ఐదు వేలు ధరావత్తుగా చెల్లించాలన్నారు.

సంచార కుటుంబాలకు టార్పాలిన్లు అందజేత

ఏలూరు క్రైం, జూలై 21 : జంగారెడ్డిగూడెం రోడ్డు సోమవరప్పాడు వద్ద రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని జీవించే పది కుటుంబాలకు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆదేశాలతో రెడ్‌క్రాస్ వలంటీర్లు టార్పాలిన్లు ఆదివారం పంపిణీ చేశారు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్డు పక్కన నివసించే సంచార కుటుంబాలు పిల్లలతో ఇబ్బందులు పడుతున్నారని గమనించిన రెడ్‌క్రాస్ ఛైర్మన్ వెంటనే వారికి టార్పాలిన్లు పంపిణీ చేయాలని వలంటీర్లను ఆదేశించడంతో రెడ్‌క్రాస్ వలంటీర్లు వారికి టార్పలిన్లు అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, జూలై 21: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వేములపల్లి సర్పంచ్ నత్తాదివ్యదీప్తి అన్నారు. వేములపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆమె అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆమె గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.


సింగన్నగూడెం బస్టాప్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో బాబా


అక్కిరెడ్డిగూడెంలో సాయినాథుడికి పూజలు


శ్రీహరిపురంలో రిటైర్డ్ హెచ్ఎం శాయరాజు దంపతులకు సత్కారం


లోకుమూడి దత్తాశ్రమంలో చండీహోమం

భక్తులతో పోటెత్తిన బాబా ఆలయాలు

»గురుపూర్ణిమ సందర్భంగా విశేష పూజలు » గురువుకు సత్కారం »కైకలూరులో ర్యాలీ

ముదినేపల్లి, జూలై 21 : శ్రీహరిపురం షిర్డి సాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. రిటైర్డ్ హైస్కూలు హెచ్ఎం, పెనుమల్లికి చెందిన బొర్రా శాయరాజు దంపతులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సత్కరించి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయులను సత్కరించటం అభినందనీయమన్నారు. పెడన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ నాయకులు వీరమల్లు నరసింహారావు, పోసిన చెంచురామయ్య, బొర్రా చలమయ్య, సర్పంచ్ విశ్వేశ్వర రావు, మందిర చైర్మన్ పరసా ఏడుకొండలు, వైస్ చైర్మన్ నీలం నరసింహారావు, కార్యదర్శి మరిపి శివ, జనసేన నాయకులు వెంకటేశ్వరరావు, బాబు పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. బొమ్మినంపాడులోని బాబా మందిరంలో జరిగిన వేడుకల్లో కామినేని, కమ్మిలి పాల్గొన్నారు. రంగాపురం, పెదగొన్నూరు బాబా మందిరాల్లోను గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. బీజేపీ నాయకుడు కోటప్రోలు కృష్ణారావు, టీడీపీ నాయకుడు శొంఠి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆటపాక, కైకలూరు, షిర్డిసాయి ధ్యానమందిరాల్లో బాబాకు ఉదయం నుంచి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల్లో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొని పూజలు చేశారు. అలాగే ఓమోః జయ పరిసంస్థాన్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కైకలూరు ఎన్టీవోస్ కాలనీ నుంచి వందలాది మంది భక్తులు ర్యాలీగా సీఎన్నార్ గార్డెన్‌కు వెళ్లారు. ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొన్నారు. అనంతరం సీఎన్నార్ గార్డెన్లో ఓంవిభోంశ్రీ సత్సంగాన్ని విన్పించారు. అనంతరం ఆలయాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు భారీగా పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి, భైరవపట్నం తదితర గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో విశేష పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. లోకుమూడి దత్తాశ్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డైరెక్టర్ గురజాడ ఉదయశంకర్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, గురుదత్తాత్రేయ పూజ అనంతరం చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముసునూరు: గురు పౌర్ణమి సందర్భంగా అక్కిరెడ్డిగూడెంలోని శిరిడి సాయినాథుడికి ఆలయ చైర్మన్ పోలవరపు నరసింహారావు ఆధ్వర్యంలో అర్చకులు విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్నసమారాధనలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం పురవీధుల్లో మేళతాళాలతో సాయినాథుడికి పల్లకి సేవ నిర్వహించారు. పలు గ్రామాల్లోని బాబా ఆలయాల్లో అన్నసమారాధనలు జరిగాయి.

ఆగిరిపల్లి: మండలంలోని బాబా మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సింగన్నగూడెం బస్‌స్టాప్ వద్దగల సర్వకార్యసిద్ధి సాయిబాబా మందిరంలో అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. విరూప టౌన్‌షిప్‌లో గల సాయిమందిరం, గన్నవరం రోడ్డులో గల వరసిద్ధి సాయి మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

కలిదిండి: పెదలంక, కొండంగి, కొండూరు గ్రామాల్లో షిర్డి సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, కాగడ హారతి, సామూహిక కలశ పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయి నామస్మరణలతో బాబా ఆలయాలు మారుమోగాయి.


లోపూడి ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

తూరలు పూడ్చి వే బ్రిడ్జి నిర్మాణం?

»పొలాలు మునక.. రహదారిపైకి నీరు

»అధికారులు పట్టించుకోవడం లేదన్న బాధితులు

ముసునూరు, జూలై 21: మండలంలోని లోపూడిలో వేబ్రిడ్జి నిర్మాణానికి ప్రధాన రహదారిలో ఉన్న నీరు పారే సిమెంట్ తూరలు పూడ్చివేశారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు నీట మునగడంతోపాటు రహదారిపైన చెరువును తలపించేలా వర్షపునీరు చేరింది. స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన పనికి తీవ్రంగా నష్టపోతున్నామని రైతుల ఆవేదన వ్యక్తం చేయగా, రహదారిపైనే నీరు ప్రవహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రెండేళ్ళ క్రితం స్థానిక ప్రజాప్రతినిధులు ప్రధాన రహదారి పక్కన పెద్ద చెరువులో కొంత భూమిని మెరకచేసి వే బ్రిడ్జిని నిర్మించారు. అయితే పొలాల నుంచి పెద్దచెరువులోకి వర్షపునీరు వెళ్ళేందుకు ప్రధాన రహదారిలో వేసిన సిమెంట్ తూరలను సైతం పూడ్చివేసి మెరక చేసి వే బ్రిడ్జి నిర్మించారు. దీంతో వర్షకాలం వచ్చిందంటే నీరుపోయే దారి లేక పొలాలు నీట మునిగి, రహదారిపైనే నీరు చేరుతోందని బాధిత రైతులు ఎలికే కృష్ణ, పాకనాటి శ్రీను, వేముల రంగమ్మ, వేల్పుల నాగేశుతో పాటు పలువురు వాహనదారులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు రెండేళ్ళ నుంచి అర్జీలు ఇచ్చినా నేటికీ పట్టించుకున్న నాధుడే లేడని వారు ఆరోపించారు. ఇప్పటికైనా పొలాల్లో వర్షపునీరు పెదచెరువులోకి వెళ్ళేలా రహదారిపై సిమెంట్ తూరలను పునరుద్ధరించేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు, వాహనచోదకులు కోరుతున్నారు.

శ్రీవారికి మంత్రి శ్రీనివాస్ పూజలు


శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న రాష్ట్ర మంత్రి శ్రీనివాస్

ద్వారకాతిరుమల, జూలై 21: రాష్ట్ర మంత్రి హోదాలో చిన్న తిరుమలేశుని దర్శించుకోవడం పూర్వ పుణ్యఫలమని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆయన స్వామి అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో దుర్గారావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. టీడీపీ నేతలు మొగ తడకల శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఆర్.రాంబాబు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

చిన వెంకన్నకు హనుమద్వాహనం అందజేత

చిన్నతిరుమలేశునికి ఆదివారం బంగారు తాపడంతో తయారైన హనుమద్వాహనాన్ని విజయనగరానికి చెందిన బొత్స ఝాన్సీలక్ష్మి 230.500 కేజీల బరువున్న ఈ వాహనాన్ని కుటుంబంతో కలసి వచ్చి దేవస్థానానికి అందజేశారు. సుమారు రూ. 32 లక్షలు విలువైన వాహనాన్ని మాజీ మంత్రి బొత్స సత్యన్నారాయణ, సతీమణి ఝాన్సీలక్ష్మి ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావుకు అందించారు. తొలుత బొత్స దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో దుర్గారావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.4 లక్షల విరాళం

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ దాత కుటుంబం రూ.4 లక్షలు విరాళంగా అందించారు. భీమవరం సమీపంలోని మందలపర్రుకు చెందిన పొట్టూరి నాగ రామకృష్ణంరాజు ఈ విరాళాన్ని నగదు రూపంలో ఆలయ కార్యాలయంలో ఆదివారం చెల్లించారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఈవో వి.త్రినాథరావు విరాళం బాండు పత్రాన్ని, అందించి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి ఘనంగా సత్కరించారు.

క్రైం సమాచారం


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణకుమార్ తదితరులు

10 కేజీల వెండి వస్తువుల చోరీ

కైకలూరు జూలై 21: కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో ఇంటి తాళాలు పగులగొట్టి 10 కేజీల వెండి వస్తువులు అపహరించినట్టు ఆదివారం గుర్తించారు. గ్రామానికి చెందిన పాలచర్ల సత్యన్నారాయణ చౌదరి కుమార్తె అమెరికాలో ఉండడంతో కొద్దిరోజుల క్రితం ఆయన అమెరికా వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో దుండగులు తాళాలు పగులగొట్టి ఇనుప బీరువాలోని సుమారు 10 కేజీల వెండి వస్తువులను చోరీ చేశారు. రెండు రోజుల్లో సత్యనారాయణ చౌదరి కైకలూరు వస్తున్నారనే సమాచారంతో పనిమనిషి ఇంటిని శుభ్రం చేసేందుకు ఆదివారం వెళ్లగా తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి వారి సోదరుడు ఏఈ శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, టౌన్ ఎస్సై రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




ఆలపాడులో కొల్లేరు ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో.. పోలవరంలో కూలిన మసీదు ప్రహరీ గోడ.. రమణక్కపేటలో కూలిన ఇంటి గోడ

కొల్లేరులో చేపల వేటకు వెళ్లవద్దు : ఆర్డీవో

కైకలూరు జూలై 21: కొల్లేరులోకి వరద నీరు చేరడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఏలూరు ఆర్డీవో కె. ఖాజావలి సూచించారు. ఆదివారం కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలోని సర్కారు కాలువ, వడ్లకూటి తిప్ప, పెంచికలమర్రు, శృంగవరప్పాడు, ఆలపాడు గ్రామాల్లో కొల్లేరు సరస్సును ఆయన పరిశీలించారు. భారీ వర్షాలకు ఎగువ నుంచి నీరు కొల్లేరులోకి చేరుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పరిశీలించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అలాగే పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు సరస్సులో నీటి మట్టం ప్రకారం ఎప్పటికప్పుడు కొలతలు తీయాలని మండవల్లి రెవెన్యూ సిబ్బందిని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఏదైనా ఇబ్బందులు కల్గితే స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమాచారాన్ని అందించాలని సూచించారు. తహసీల్దార్ ఎస్. పోతురాజు, ఆర్ఐ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన మసీదు ప్రహరీ, ఇంటి గోడ.. ఆదుకోవాలని వినతులు

చాట్రాయి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పోలవరం గ్రామంలో మసీదు ప్రహరీ గోడ కూలిపోయింది. గోడ కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. ప్రజా ప్రతినిధులు స్పందించి మళ్ళీ ప్రహరీ గోడ నిర్మించుకోవటానికి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని మసీదు కమిటీ సభ్యులు కోరారు.

ముసునూరు: వర్షాలకు రమణక్కపేట ఎస్సీ కాలనీలో ఆదివారం ఆముదాల శుభరావు పూరింటి గోడ కూలిపోయింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదనని, ఇంటి మరమ్మతుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని బాధితుడు కోరుతున్నాడు. వీఆర్వో రవికాంత్ కూలిన గోడను పరిశీలించి తహసీల్దార్ జవహర్ బాజికి నివేదిక ఇస్తానని తెలిపారు.


కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి వెండి బిందె బహూకరణ

వెండి బిందెల బహూకరణ

కైకలూరు జూలై 21: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి, గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామికి వెండి బిందెలను భక్తులు కానుకగా అందజేశారు. ఆదివారం దెందులూరు మండలం పోతునూరు పంచాయతీ పరిధిలోని కేదారం గ్రామానికి చెందిన కాళ్ళ అప్పారావు అమ్మవారికి 500 గ్రాముల వెండి కూజా బిందె, గోకర్ణేశ్వరస్వామికి 500 గ్రాముల వెండి కూజా బిందెను కానుకగా ఆలయ ఈవో కేవీ గోపాలరావుకు అందజేశారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. వెండి బిందెలు సమర్పించిన కాళ్ళ అప్పారావు కుటుంబీకులతో విశేష పూజలు చేయించి వారిని శేష వస్త్రాలతో సత్కరించారు.

కన్యకా పరమేశ్వరికి ఆషాఢ సారె



కైకలూరు జూలై 21: కైకలూరు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు ఆదివారం ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అర్చకులు విశేష పూజల అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చొప్పర్ల మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణమూర్తి, కోశాధికారి రాజా ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.

డీసీవో ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

ముదినేపల్లి, జూలై 21 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో హెచ్ఆర్ పాలసీ అమలు, సిబ్బంది జీతాల చెల్లింపుపై ఆంక్షలు విధిస్తూ ఏలూరు జిల్లా సహకార శాఖాధికారి జారీ చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా జరిగిన సిబ్బంది నియామకాలు అనధికారమైనవని, పీఏసీలు వారికి జీతాలు ఇవ్వరాదని డీసీవో ఆదేశించటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. 2019 మార్చి 1వ తేదీ తర్వాత జరిగిన నియామకాలకు జిల్లా సహకార సాధికార కమిటీ ఆమోదం లేదని, అటువంటి సిబ్బందికి జీతాలు చెల్లిస్తే ప్రస్తుత పీఏసీల నుంచి రికవరీ చేస్తామని డీసీవో ఉత్తర్వులు జారీ చేయటం సమంజసం కాదన్నారు. అనధికారిక నియామకాలు జరిగితే అప్పటి నుంచి కమిటీలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. డీసీవో తన ఉత్తర్వులను ఉపసంహరించుకోకపోతే ఈ నెల 30న ఏలూరు డీసీవో కార్యాలయం ముందు తమ సంఘం ధర్నా చేస్తుందని రఘురామ్ తెలిపారు.


కానుకొల్లులో నీటమునిగిన పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పంటలను కాపాడుకోవాలి

మండవల్లి జూలై 21 : వరి రైతులు పంటలను ముంపు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించా లని మండల వ్యవ సాయాధికారిణి షేక్ జరీనా అన్నారు. ఆదివారం కాను కొల్లులో నీట మునిగిన పొలాలను పరిశీలించి మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పంటల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తపడాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే ప్రతి రైతు ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలన్నారు. పైర్లకు తెగుళ్ళు వస్తే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

టీచర్స్ లేరుగా... టీసీలిచ్చేయండి

»ఖాళీ అవుతున్న యూపీ పాఠశాలలు

»హైస్కూళ్లలో చేరుతున్న విద్యార్థులు

»స్కూల్ అసిస్టెంట్ల నియామకానికి ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక యూపీ స్కూళ్ల నుంచి టీసీలు తీసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను హైస్కూళ్లలో చేర్పిస్తున్నారు. ఈ స్కూళ్లలో 6, 7 తరగతుల విద్యార్థులకు లెక్కలు, సైన్సు, సోషల్ సబ్జెక్టులతోపాటు హిందీ బోధనకు టీచర్లు లేక విద్యార్థులు హైస్కూళ్లకు వెళ్లిపోతున్నారు. దీంతో యూపీ పాఠశాలలు ఖాళీ అవుతున్నాయి.

ముదినేపల్లి, జూలై 21 : వైసీపీ ప్రభుత్వం 117 జీవో ద్వారా 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయటంతో యూపీ పాఠశాలల్లోని సబ్జెక్టు టీచర్లు (స్కూల్ అసిస్టెంట్లు) హైస్కూళ్లకు బదిలీ అయ్యారు. యూపీ స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ పోస్టులు రద్దయ్యాయి. ముదినేపల్లి మండలంలో 11 మండల పరిషత్ యూపీ పాఠశాలలు ఉండగా, ఒక్క సింగరాయపాలెం పాఠశాలలో మాత్రమే సబ్జెక్టు టీచర్లు ఉన్నారు. మిగిలిన పది పాఠశాలల్లో 6 నుంచి 8 వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ ఒక్క సబ్జెక్టు టీచర్ కూడా లేరు. టీచర్లు లేకపోవటంతో యూపీ పాఠశాలల నుంచి టీసీలు తీసుకుని ఈ విద్యాసంవత్సరంలో 80 మంది విద్యార్థులు హైస్కూళ్లలో చేరారు. కాకరవాడ, చేవూరు యూపీ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులంతా హైస్కూళ్లకు వెళ్లిపోగా, దేవపూడి యూపీ పాఠశాలలో 7వ తరగతిలో విద్యార్థుల్లేరు. వైవాక పాఠశాల నుంచి ఏడుగురు, కోడూరు స్కూలు నుంచి పది మంది, వాడవల్లి స్కూల్ నుంచి 14 మంది, కొరగుంటపాలెం స్కూలు నుంచి ముగ్గురు, చినకామనపూడి స్కూలు నుంచి ముగ్గురు, దేవపూడి స్కూలు నుంచి 11 మంది విద్యార్థులు పెడన మండలం చెన్నూరు, బంటుమిల్లి మండలం మలపరాజు గూడెం హైస్కూళ్లలో చేరారు. చినకామనపూడి స్కూలులో 24 మంది విద్యార్థులుండగా, ఉపాధ్యాయులే విద్యా వలంటీరును నియమించుకుని సబ్జెక్టులు బోధించే ఏర్పాటు చేయగా, దాకరం యూపీ పాఠశాలలో 49 మంది 6, 7, 8 తరగతి విద్యార్థులకు ఎస్జీటీలే బోధిస్తున్నారు.



దేవపూడి యూపీ పాఠశాల

పదోన్నతులు కల్పించాలి



సబ్జెక్టు టీచర్లు లేకపోవటంతో యూపీ పాఠశాలల్లో విద్యార్థులు నష్టపోతున్నారు. ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించి స్కూల్ అసిస్టెంట్స్‌గా నియమిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది.

-రాజేంద్ర ప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకుడు, ముదినేపల్లి

స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి



యూపీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలి. విద్యార్థులకు సబ్జెక్టుల బోధన కరువైంది. జీవో 117ను రద్దు చేసి సబ్జెక్టు టీచర్లను నియమించాలి.

-సాయి లక్ష్మి, యూటీఎఫ్ ముదినేపల్లి మండల అధ్యక్షురాలు

నేటి నుంచి శిక్షా సప్తాహ్: ఎంఈవో

చాట్రాయి, జూలై 21: జాతీయ విద్యా సంస్కరణలు తెలియజేయాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 28 వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 22న స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన, 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం, 24న క్రీడా పోటీలు, 25న సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే 26న సాంకేతిక నైపుణాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహిస్తారని, వీటిలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లులను భాగస్వామ్యం చేయాలని ఎంఈవో అన్ని పాఠశాలల హెచ్ఎంలను ఆదేశించారు.


కాలనీలో ఏర్పాటుచేసిన బోరు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎన్టీఆర్ కాలనీలో మౌలిక వసతులు

నూజివీడు, జూలై 21: నూజివీడు పట్టణంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఎన్టీఆర్ కాలనీలో కనీస అవసరాలు సైతం లేక నానా ఇబ్బందులు పడిన కాలనీ వాసులు నేడు డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటికి బోర్ల ఏర్పాటుతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కనీసం తాగునీరు లేక, డ్రెయినేజీలు, రహదారులు లేకపోవడంతో దుర్భర జీవితం గడిపే వాళ్ళమని కూటమి ప్రభుత్వం ఏర్పడి మంత్రిగా పార్థసారథి బాధ్యతలు చేపట్టి మౌలిక వసతులు కల్పించడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేసి మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

'యువత' నాయకుడి సహకారంతో పూడికతీత



చాట్రాయి, జూలై 21: తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షానికి మండలంలోని చనుబండ శివారు సూరంపాలెంలోని నివాస ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, తెలుగు యువత నాయకుడు బొంతు సతీష్ తన సొంత నిధులతో ఎక్సకవేటర్ ఏర్పాటు చేసి డ్రెయిన్లు పూడిక తీయించి ముంపు సమస్య పరిష్కరించారు.

సచివాలయంలో ప్రజాప్రతినిధుల చిత్రపటాలు



ముసునూరు, జూలై 21: మండలంలోని గోపవరం గ్రామ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు పార్థసారథి, లోకేశ్ చిత్రపటాలను పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. పంచాయితీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి సుకుమార్, టీడీపీ నాయకులు వడ్లపట్ల మురళీమోహన్, చిలకంటి శేషకుమార్, సాయిల అనిల్, షేక్ బాజి, నండూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు చేపల చెరువులకు మళ్లిస్తే చర్యలు


సీబీ కెనాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

కలిదిండి, జూలై 21: తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దశిక వంశీ హెచ్చరించారు. శనివారం రాత్రి కలిదిండిలో సీబీ కెనాల్‌లో తాగునీటి సరఫరాను పరిశీలించి మాట్లాడుతూ లంక గ్రామాలైన సంతోషపురం, భాస్కరరావుపేట, మూల్లంక, పెదలంక, మట్టగుంట, కొండంగి గ్రామాల తాగునీటి చెరువులకు తాగునీటి వంతు వెళ్తుందన్నారు. వర్షాలకు కాల్వలకు గండ్లు పడే అవకాశం ఉందని కాల్వ గట్లను పటిష్టం చేయాలన్నారు. తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నిండే వరకు కాల్వల వెంబడి సంబంధిత అధికారులు పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. కాల్వ వెంబడి ఆయిలింజన్లు, మోటార్లు ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పాఠశాలలకు వెళ్లాలంటే పాట్లే..


మట్టగుంటలో మెయిన్ రోడ్డు దుస్థితి

కలిదిండి, జూలై 21 : మండలంలోని మట్టగుంటలో మెయిన్ రోడ్డు శిధిలావస్థకు చేరటంతో విద్యార్థులు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దుర్గమ్మ ఆలయం నుంచి కొండంగి వైపు సుమారు 2 కిలోమీటర్ల మేర రహదారి పెద్ద గుంతలు పడి అధ్వానంగా ఉంది. కొద్దిపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలబడటంతో చెరువులను తలపిస్తున్నాయి. విద్యార్థులు గుంతల్లో జారిపడి గాయాలపాలవుతున్నారు. అధ్వాన రహదారిపై ప్రయాణించలేక ద్విచక్ర వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. వర్షపు నీరు గోతుల్లో నిలిచి అపరిశుభ్రత నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. ఐదేళ్లుగా పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా రహదారికి తక్షణమే మరమ్మతులు జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.